ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 22 | సంచిక : 8 | ఏప్రియల్ 2017

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

07-10-1984
జిన్నూరు
11-01-2017
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## సద్గురు శ్రీ జిన్నూరు 'నాన్నగారు'

**- హర్షవర్ధన్, జాయింట్ కమీషనర్**

ప్రభుత్వ ఉద్యోగిగా నా ప్రస్థానం నరసాపురం నుండి ప్రారంభం కావడం యాదృచ్ఛికమే కానీ శ్రీ నాన్నగారితో నా పరిచయం మాత్రం దైవికమే. ఎందుకంటే భగవాన్ శ్రీ రమణ మహర్షి చెప్పినట్లు 'ఎవ్విరితింగ్ ఈజ్ ప్రీడిటెర్మిన్డ్'. ఆదిశంకరులు వివేకచూడామణిలో చెప్పినట్లు భగవత్ కృప వల్లనే శ్రీ నాన్నగారి సజ్జనసాంగత్యం, ఆత్మీయ మిత్రులు కీర్తిశేషులు డాక్టర్ సూర్యనారాయణరాజుగారి వలన లభించింది. అలా 1988లో మొదలైన వారి సాన్నిహిత్యం గురుకృపతో నేటికీ కొనసాగుతోంది. వారిని దర్శించిన ప్రతీసారి వారి సమక్షంలో అవ్యక్త ఆనందానుభూతి, మానసిక ప్రశాంతత అనుభవించగలగడం వారి కరుణతోనే అని నా ప్రగాఢ విశ్వాసం. గత ముప్ఫై ఏళ్ళుగా వారి దివ్యాశీస్సులతో మా కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలతో జీవనం కొనసాగిస్తున్నాము.

శ్రీ నాన్నగారు ఇతర గురువుల వలె ఆడంబరాలు, మతం గుర్తులు లేకుండా భగవాన్ రమణులు చూపిన నిరాడంబరమైన, అత్యంత సాధారణమైన, సులభమైన సాధనా పద్ధతినే భక్తులకు బోధిస్తూ గృహస్థ ఆశ్రమంలోనే భక్తి, జ్ఞాన సాధనతో ముక్తి పొందగలమని ఎన్నో ప్రసంగాలలో చెప్పడం జరిగింది. వారిని దర్శించిన ప్రతీసారి నిత్యజీవితంలో మనం ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు సులభంగా ఆచరించగలిగే పరిష్కారాలను చూపేవారు. ఎవరి స్థాయికి, వయస్సుకి తగినట్లు వారికి అర్థమై, పాటించే విధంగా సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఆశ్రితులైన భక్తులపట్ల వారి మాటల్లో అవ్యాజమైన ఆత్మీయత, ప్రేమ, వారి చూపులో కరుణ ద్యోతకమయ్యేవి. ఎంత ఆందోళనతో

వెళ్ళినా వారి మాటలు మనస్సుకు స్వాంతననిచ్చేవి.

వారితో నాకు గల కొన్ని అనుభవాలను మీతో పంచుకొంటాను. ఒకసారి మా పెద్దబ్బాయి సందీప్ మెడిసిన్‌లో చేరిన సంవత్సరం నాన్నగారి ఆశీస్సుల కొరకు వెళ్ళాము. అప్పుడు నాన్నగారు ఒకానొక సందర్భంలో మానవదేహం గురించి మాట్లాడుతూ భగవాన్ రమణులు 'ఈ ఖగోళంలో ఎన్ని రహస్యాలు ఉన్నాయో అంతకు మించిన రహస్యాలు మానవ శరీరంలో ఉన్నాయి' అని చెప్పారని చెపుతూ అందువలన డాక్టర్ వృత్తిలో వున్న ప్రతి ఒక్కరూ జీవితాంతం వరకు చదువుతూనే ఉండాలి అని చెప్పారు. ఇందుకు ఉదాహరణగా కీ॥శే॥ డాక్టర్ జ్ఞానేశ్వర్ (విశాఖపట్నంలో ప్రఖ్యాత వైద్యులు) వారికి చివరిదశలో క్యాన్సర్ వ్యాధి కలిగి కొద్దికాలం మాత్రమే జీవిస్తారు అని తెలిసిన తరువాత కూడా వారు ప్రతీరోజు 2,3 గంటలు చదివే వారని చెప్పారు. నిరంతర అధ్యయనం వైద్యులకి విధిగా ఉండాలని వారు చెప్పిన మాట ఇప్పటికీ మా అబ్బాయి జ్ఞాపకం చేసుకొంటాడు. 'వైద్యులు వివరంగా చదవాలి, ఓర్పుగా ఉండాలి' అని కూడా చెప్పారు. మేము వారిని ఎప్పుడు కలిసినా పేరుపేరునా కుటుంబ సభ్యులందరి స్థితిగతులు అడిగి మరీ చెప్పించుకుంటారు.

మా వదినగారు పదేళ్ళ క్రితం ఒకసారి మాతోపాటు నాన్నగారిని దర్శించారు. అప్పుడు ఆమె కొన్ని కుటుంబ సమస్యలు, ఆర్థిక ఒడిదుడుకులలో ఉన్న సంగతి నాన్నగారికి చెప్పకున్నారు. నాన్నగారు ఆమెకు మనోధైర్యాన్నిచ్చి అన్ని సమస్యలు త్వరలో సర్దుకుంటాయి అని చెప్పారు. వారి ఆశీస్సులతో అనతికాలంలో వాళ్ళ సమస్యలన్నీ తీరిపోయి వారి ఇద్దరు అబ్బాయిలు బాగా చదువుకొని అమెరికాలో స్థిరపడ్డారు. మేము ఎప్పుడు నాన్నగారిని కలిసినా మీ వదినగారి కుటుంబం బాగుందా అని వారి యోగక్షేమాలు తప్పనిసరిగా అడుగుతారు.

మా సహోద్యోగి కీ॥శే॥ వసుంధరగారు నాన్నగారిని తరచు దర్శించేవారు. ఆమెకు ఉద్యోగం చివరి దశలో కొన్ని ఇబ్బందుల వలన పెన్షన్ కూడా విడుదల కాలేదు. ఆ సమయంలో నేను నాన్నగారిని ఎప్పుడు కలిసినా 'వసుంధర గారి విషయం ఏమైంది? మీరు ఎలాగైనా ఆమెకు సాయం చేసి పెన్షన్ వచ్చేలా చూడాలి' అని పదే పదే చెప్పేవారు. ఆశ్రితుల పట్ల వారికి అపారమైన శ్రద్ధ, కరుణ. ఎంతోమంది వారి సమస్యలను, ఆందోళనలను నాన్నగారితో పంచుకొని వారి మాటలతో గొప్ప స్వాంతన పొందడం ఎన్నోసార్లు ప్రత్యక్షంగా చూసాను.

కొన్నిసార్లు నాన్నగారిని కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు చాలామంది భక్తులు వేచి ఉండటం వలన వారికి ఇబ్బంది కలుగకూడదని నేను వెళ్ళడానికి తొందరపడేవాడిని, నాన్నగారు మాత్రం "నాకు వాళ్ళు కనిపిస్తున్నారుగా ఇంకొంచెం సేపు కూర్చోండి" అని

కూర్చోబెట్టేవారు. మాకు వీడ్కోలు చెప్పడానికి మేము ఎంత వారించినా కారు వరకు వచ్చి మేము బయలుదేరే వరకు ఉండి సాగనంపేవారు. వారి ఆతిథ్యం, కరుణ, ప్రేమ అనంతమైనవి. ఎప్పుడు వారిని కలిసినా టీ, కాఫీ తాగుతారా అని అడిగి, ఏదో ఒకటి తాగేవరకు వదలరు. వారి దర్శనార్థమై వచ్చిన భక్తులకు పండ్లు, పుస్తకాలు ఇస్తారు. ఎవ్వరినీ వొట్టి చేతులతో పంపగా నేను చూడలేదు. ఇటీవల కొద్దినెలలుగా వారు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా భక్తులపై గల అవ్యాజ ప్రేమతో ఎంతో ఓపికగా గంటల తరబడి కూర్చుని ప్రశాంత వదనంతో దర్శనమిస్తూ వారిని సంతృప్తి పరుస్తున్నారు.

మరొక సందర్భంలో నాన్నగారిని కలిసినప్పుడు గతంలో ఒక సందర్శకునితో వారి అనుభవం చెప్పారు. ఆ సందర్శకునికి నాన్నగారు శ్రీ రామకృష్ణ లీలామృతం పుస్తకం ఇవ్వబోగా ఆయన "నేను చదవను పుస్తకం వద్దు' అన్నా సరే నాన్నగారు 'పరవాలేదు ఎప్పుడో ఒకప్పుడు చదువుతారు తీసుకెళ్ళండి' అని బలవంతంగా పుస్తకం ఇచ్చి పంపారట. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు ఆ వ్యక్తి నాన్నగారిని కలుసుకొని పుస్తకం చదివానని చాలా బాగుందని చెప్పి ఆ పుస్తకాన్ని 500 కాపీలు ఆయనే ముద్రించి చాలా మందికి పంచిపెట్టానని చెప్పారట. గత డిసెంబర్ నెలలో వేల్పూరు (తణుకు దగ్గర) లో ఉన్న ఆశ్రమంలో ఒకరోజు ఉన్నాను. అక్కడ ఉన్న స్వామి గత 25 ఏళ్ళుగా మౌనం పాటిస్తూ భగవాన్ రమణుల మార్గంలో భక్తులను నడిపిస్తున్నారు. వారిని కలిసినప్పుడు వారు మౌనవ్రతులవడంతో పలకపై 'నేను ఏప్రియల్ 2017లో రిటైర్ అవుతున్నాను' అని వ్రాస్తే దానికి సమాధానంగా 'మీరు నాన్నగారితో ఉన్న సాన్నిహిత్యాన్ని మరింత బలపరచుకొని సాధన కొనసాగిస్తూ ఉండండి' అని చెప్పడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

నాన్నగారి ప్రోత్సాహంతో ఎంతోమంది గ్రంథపఠనంతో ఆరంభించి సాధన వైపు మరలడం ఎంతో వాస్తవం. మరీ ముఖ్యంగా విశాఖపట్నం మొదలుకొని హైదరాబాద్ వరకు ఎన్నో సందర్భాల్లో నాన్నగారు తమ ప్రవచనాలతో ప్రజలను ప్రభావితం చేస్తున్నారు.

వారి బోధనలు ప్రవచనాలతో ప్రభావితులైనా వేలాది మంది భక్తులు భగవాన్ రమణుల మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఎంతోమందికి ఆధ్యాత్మిక జీవనంలోని ఆనందాన్ని, ధ్యాన విశిష్ఠతను బోధించి సన్మార్గంలో నడుపుతున్న సద్గురువులు నాన్నగారికి పాదాభివందనములతో....

**హర్షవర్థన్**

జాయింట్ కమీషనర్, వాణిజ్య పన్నులు,

విశాఖపట్నం, సెల్ - 9949992880

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-10-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నేను చెప్పే మాటలు ఇక్కడ కూర్చున్న పదిమందికి మాత్రమే వర్తిస్తాయని మీరు అనుకోవద్దు. ఏదో నాలుగు రూపాయలు సంపాదించుకోవటం, ఏదో కొంత కీర్తి సంపాదించుకోవటం, ఇలా సంపాదించుకొంటూ ఇదే జీవితం అనుకొంటున్నారు. మన జీవితాలు ఇంచుమించుగా దీనికే ఖర్చుపెట్టేస్తున్నాము. మీరు ఒక్కసారి ఆలోచించుకోండి. మీరు చేసే ప్రతీ పనీ కూడా మీ సంతోషం కోసమే చేస్తున్నారు కాని దేవుడి కోసం చేస్తున్నాము అని మీరు అనుకొంటున్నారు. కానే కాదు. ఎప్పుడు మీరు దేవుడికోసం చేసినట్లు అవుతుంది అంటే దేవుడు ఇది మంచి అని చెపితే అది మీ మనస్సుకు నచ్చకపోయినప్పటికీ కూడా మీ మనస్సులో ఉన్న భావాలను బలిచేసి, దేవుడికోసం మీరు ఆ పని కనుక చేస్తే అప్పుడు మీరు దేవుడికోసం పని చేసినట్లు అవుతుంది. నీ అహంకారం కోసం, నీ సంతోషం కోసం నీవు పనిచేస్తూ ఉంటే అది భగవంతుడికోసం చేసినట్లు ఎలా అవుతుంది? మీకు ఏ రకమైన సంతోషం అక్కరలేదు అనుకోండి, ఇంక మీకు కోరికతో పని ఏముంది? లోపల నీకు ప్లెజర్ కావాలి కాబట్టి డిజైర్ వస్తోంది. నీకు ప్లెజర్ అక్కరలేకపోతే డిజైర్‌తో పనిలేదు. మనిషి చేత పాపం చేయించేది మోహమే. మీ హృదయంలో మోహం లేదు అనుకోండి ఇంక మీరు పాపం చెయ్యరు. మన హృదయంలో సత్యం ఎప్పుడూ ప్రకాశిస్తోంది, ఆత్మలేని క్షణం అంటూ లేదు. కాని దానిని తరువాత తెలుసుకొందాము, మళ్ళీ జన్మలో తెలుసుకొందాము అని మనం అనుకొంటున్నాము. మళ్ళీ జన్మలో తెలుసుకోవటం ఏమిటి? ఇప్పుడు ఏది మీకు అడ్డు వస్తోంది? ఈ ఊరు నాది, ఈ జిల్లా నాది, ఈ దేశం నాది ఇటువంటి భావాలు కూడా మనం ఆత్మను తెలుసుకోవటానికి అడ్డు వస్తాయి.

మనం ఈ భూమి మీదకు వచ్చాము కాని ఈ భూమి మనది కాదు. శరీరం మీద ఉన్న ప్రారబ్ధాన్ని అనుభవించడానికి మనం ఈ భూమి మీదకు వచ్చాము. మనం ఏమనుకొంటున్నాము అంటే ఈ భూమి మనది అనుకొంటున్నాము. ఈ భూమి మనది కాదు. మనది కాదు కాబట్టి మనం ఈ భూమిని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము. అసలు మనం ఈ భూమి మీదకు రావలసిన పని ఏమిటి? ప్రారబ్ధం ఖర్చు చేసుకోవటం కోసం ఈ భూమి మీదకు వచ్చాము. దేహప్రారబ్ధం ఖర్చు అవ్వగానే ఈ భూమిని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము. చాలా వండర్‌ఫుల్ విషయం ఏమిటి అంటే మనిషి జన్మించినది

మొదలు మరణించేవరకు నేను, నేను అని ఇలా అంటూనే ఉంటాడు. కాని ఈ నేను ఎవరు అనే ప్రశ్న ఎవరికయినా ఎప్పడయినా వచ్చిందా? మనం మరణించే లోపు నేను, నేను అని కొన్ని లక్షలసార్లు అంటున్నాము కదా. వాట్ ఈజ్ దిస్ ఐ? నేను, నేను అనే ఈ నేను ఎవరు అన్న ప్రశ్న ఇప్పటి వరకు మీలో ఎవరికయినా వచ్చిందా? ఇదే మాయ. మాయ అంటే ఎక్కడో ఉంది అనుకొంటున్నారు. ఈ ప్రశ్న మీలో ఉదయించకపోవటమే మాయ. రాముడి గురించి ఆలోచించమంటే ఆలోచిస్తారు. రాముడు రావణాసురుడ్ని చంపాడంటే శ్రద్ధగా వింటారు. కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తాడు అంటే అంత చిన్న పిల్లవాడు అంత పెద్ద పర్వతాన్ని ఎలా ఎత్తాడండీ అని ఆశ్చర్యంగా వింటారు. హనుమంతుడు సముద్రాన్ని దాటాడు అంటే మీకు ఆశ్చర్యంగా ఉంది. కాని మనం నేను, నేను అని ఇన్నిసార్లు అంటున్నామే. ఈ నేను ఎవరు అని ఆ నేను గురించి మనకు ఎప్పడూ విచారణ రావటం లేదు ఏమిటి అని మీకు ఎందుకు ఆశ్చర్యం కలగటం లేదు. మీ నోటి నుండి కొన్ని వేలసార్లు వచ్చే ఈ నేను గురించి మీరు ఆలోచించకపోవటం, ఆశ్చర్యం కాదా! ఈ ప్రపంచంలో సుపీరియర్ నాలెడ్జ్, ఎక్సలెంట్ నాలెడ్జ్ ఏదయినా ఉందంటే అది ఈ నేను గురించి తెలుసుకోవటమే. దానికి మించిన నాలెడ్జ్ అంటూ ఏమీ లేదు. ఈ భూమికి సంబంధించిన విషయాలు కూడా ఒక రకమైన మత్తును తీసుకొని వస్తాయి. మీరు రోజూ నమస్కారాలు పెట్టుకొనే సూర్యుడు కూడా జడవస్తువే. ఆ జడవస్తువును ప్రకాశింపచేసేవాడు మీ హృదయంలో ఉన్న పరమాత్మే. మన హృదయంలో ఉన్న పరమాత్మే మనకళ్ళకు కనిపించే సూర్యుడిలో కూడా ఆయనే ఉన్నాడు, అది మర్చిపోకండి. ఈ శరీరం నేను అనుకొంటున్నారు కాబట్టి సూర్యుడు దేవుడు అనుకొంటున్నారు. మీ శరీరాన్ని ఎవడయితే నడిపిస్తున్నాడో, ఆ పరమాత్మే సూర్యుడిలో ఉండి వెలుతురు ఇస్తున్నాడు, చంద్రుడిలో ఉండి చల్లదనాన్ని ఇస్తున్నాడు అన్న సంగతి మనలో ఎంతమందికి తెలుసు?

మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని చాలామంది అంటూఉంటారు. రోజులు బాగా వెళ్ళిపోవటమేనా మన జీవితలక్ష్యం. మన ఎయిమ్ ఆఫ్ లైఫ్ ఇంతేనా? ఎవడైతే తన పొట్టకోసం, బట్టకోసం నిరంతరం ఆలోచిస్తున్నాడో వాడు తన జీవితాన్ని పోగొట్టుకొన్నట్లు లెక్క. ఈ దేహాన్ని వేదాంత పరిభాషలో అన్నమయకోశం అంటారు. అన్నం తినటం వలన అది పెరుగుతూ ఉంటుంది, అలా తిరుగుతూ ఉంటుంది. అన్నం తినటం మానేస్తే అది చచ్చిపోతుంది. అన్నం మానేస్తే జ్ఞానం వచ్చేస్తుంది అని కొంతమంది అనుకొంటారు. అసలు జ్ఞానానికి దీనికి సంబంధం ఏమిటి? ఆయన ఒక సంవత్సరం నుంచి అన్నం తినటంలేదు అంటే ఆయన

జ్ఞానేమో అనుకొంటారు. ప్రపంచం యొక్క పరిస్థితి అలా ఉంది. మీకు ఒక చిట్కా చెపుతున్నాను. మనస్సు ఆలోచించకుండా ఉండలేదు కదా. అందుకని మీరు ఆలోచిస్తే పవిత్రత గురించి ఆలోచించండి. మీరు జ్ఞానులు అయిపోతారు. మీరు చూస్తే పవిత్రతను చూడండి. మీరు వింటే పవిత్రత గురించి వినండి, మీరు ఆలోచిస్తే పవిత్రత గురించి ఆలోచించండి, అప్పుడు మీకు జ్ఞానం వచ్చేస్తుంది. క్లారిటీ వలన ప్యూరిటీ వస్తే, ప్యూరిటీ వలన పెర్ఫెక్షన్ వస్తుంది. మోక్షానికి మరొకపేరే పూర్ణస్థితి. మీకు పూర్ణస్థితి ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు మీకు మోక్షం వచ్చినట్లే. మీకు హృదయంలో కనుక పవిత్రత లేకపోతే నేను రోజుల తరబడి, సంవత్సరాల తరబడి ఇలా చెప్పినా మీకు మోక్షానికి దారి కనబడదు. ఈ మాటలు చెప్పకోవటానికి ఎక్కడో ఒకచోట కూర్చోవాలి కాబట్టి ఈ రమణ కేంద్రాలు అని, ఇటుకలు అని, సిమ్మెంటు అని, ఇసుక అని ఈ గొడవ అంతా వస్తోంది. ఆత్మను తెలుసుకోవటానికి సిమ్మెంటు అక్కరలేదు, ఇటుకలు అక్కరలేదు, రూపాయలు అక్కరలేదు. ఆత్మను తెలుసుకోవటానికి ఏ వస్తువుతోటి పనిలేదు. కేవలం మీరు పవిత్రులు అయితే ఆత్మ మీకు దర్శనం ఇస్తుంది. మీరు ఆత్మను చూడటంకాదు, ఆత్మే మీకు దర్శనం ఇస్తుంది.

మేము చాలా పెద్ద కుటుంబంలో పుట్టాము అని కొంతమంది అంటారు. అది కూడా అహంకారమే. లియోటాల్‌స్టాయ్ 40 గదులు ఉన్న పెద్ద మేడలో పుట్టి రైల్వే ఫ్లాట్‌ఫారమ్ మీద దిక్కులేని చావు చనిపోయాడు. మానవజీవితం ఎలా ఉంటుందో చూడండి. ఆయన భార్యకు దూరమై, బిడ్డలకు దూరమై, ఐశ్వర్యానికి దూరమై ఎవరికీ కాకుండా పోయానే అని ఇంటి మీద వైరాగ్యం పెట్టుకొని రైలుకోసం ఫ్లాట్‌ఫారమ్ మీద ఎదురుచూస్తూ శీతాకాలంలో చలికి వణికిపోతూ రైలు వచ్చేలోపే ఫ్లాట్‌ఫారమ్ మీద ప్రాణాలు విడిచిపెట్టాడు లియోటాల్‌స్టాయ్. అదీ జీవితం. మీరు దేహమా, ఆత్మా? నువ్వు ఆత్మవు. ఆత్మకు కుటుంబం లేదు, ఇంక పెద్ద కుటుంబంలో పుట్టటం ఏమిటి? కాలక్షేపానికి ఇటువంటి మాటలు చెప్పకొంటూ ఉంటే ఇది ఎక్కడికి దారి తీస్తుంది అంటే మీరు ఆ కుటుంబంతో కలిసిపోతారు, ఇంక ఆత్మను ఎలా తెలుసుకొంటారు? అంటే మీరు మీ శరీరానికి పరిమితమైపోతారు, మీ ఊరికి పరిమితమైపోతారు, మీ సంస్కృతికి, సాంప్రదాయాలకు పరిమితమైపోతారు. మీ కలహాలకు పరిమితమైపోతారు. ఇంక మీ మనస్సు ఎప్పుడు వాటిలో నుండి బయటకు వస్తుంది, ఎప్పుడు మీ మనస్సు ఆ జైలులో నుండి బయటకు వచ్చి స్వేచ్ఛను పొందుతుంది? ఎప్పుడు మీ మనస్సు పరిశుద్ధం అవుతుంది? మీ మనస్సును తీసుకొనివెళ్ళి మీ కుటుంబానికి కట్టేస్తే ఇంక ఆత్మను తెలుసుకోవటానికి నీవు దానికి స్వేచ్ఛ ఇస్తే కదా? స్వేచ్ఛలేని మనస్సు,

పవిత్రతలేని మనస్సు ఇంక ఆత్మను ఎలా తెలుసుకొంటుంది? ఇప్పుడు మీ మనస్సు స్వేచ్ఛగా ఉందా? బంధింపబడి ఉందా? చెప్పండి. మీ మనస్సు బంధింపబడి ఉంది కాబట్టి మీకు దుఃఖం వస్తోంది. ఒక మనిషిని జైల్లో పెట్టేసి నువ్వు ఈ పని పూర్తి చేసుకొని రా అంటే వాడు ఆ పని చేయగలడా? వాడి వలన ఏ పనీ అవ్వదు. అలాగే ఆ గొడవ అని, ఈ గొడవ అని మన మనస్సును మనమే జైల్లో పెట్టేసాము. దానికి ఎప్పుడు స్వేచ్ఛ వస్తుంది? ఎప్పుడు ఆత్మను తెలుసుకొంటుంది? ఇప్పుడు మనందరం జైలులో ఉన్నాము. మీ కాళ్ళు చేతులు స్తంభానికి కట్టేసి తిరగమంటే ఎలా తిరగగలరు? మీరు తిరగలేరు. అలాగే మీ మనస్సును మీరు కట్టేసుకొంటే ఇంక మీరు ఎలా ఆలోచించగలరు? ఎలా వికాశం పొందగలరు? ఆత్మను తెలుసుకోవటానికి ఎలా ప్రయత్నం చేయగలరు?

సోదర మహాశయులారా! ఈ ప్రాపంచికవిషయాల నుండి మీ మనస్సు ఎంత సంతోషాన్ని పీల్చుకొంటుందో, మీరు ఆత్మకు అంత దూరం అవుతున్నారని గ్రహించండి. మీరు ఆత్మసుఖాన్ని పొందకుండా మనస్సుకు ప్రాపంచికవిషయాలు రుచి చూపిస్తూ ఉంటే మీరు ఆ రోజుకి ఆరోజు, ఆ జన్మకు ఆ జన్మ ఆత్మకు దూరమైపోతారు. ఏ ప్రాపంచికవిషయాలతో అయితే మీ మనస్సు తగులుకుందో మళ్ళీ ఆ ప్రాపంచికవిషయాల నుండి మీ మనస్సును విడుదల చేసి, వాటిలోనుండి మీ మనస్సును బయటకు తీసుకొని రావటానికి మీకు కొన్నివేల జన్మలు పట్టవచ్చు. మనం జీవించే జీవితాలు అన్నీ మాయ జీవితాలు. సినిమా తెరమీద కనిపించే బొమ్మలకు మన శరీరాలకు ఏమీ తేడాలేదు. మనిషి డబ్బును ఎలా సంపాదిస్తున్నాడో అలాగే మీకు నాలుగు మాటలు చెప్పటం ద్వారా నేను కీర్తిని సంపాదించాలి అని అనుకొంటే నాకు తెలియకుండానే నేను ఆత్మకు దూరమైపోతాను. ఒక మనిషి మాట్లాడేటప్పుడు వాడు మతం గురించి చెప్పనివ్వండి, దేవుడి గురించి చెప్పనివ్వండి, సంఘ సంస్కరణల గురించి చెప్పనివ్వండి, దేని గురించి చెప్పినప్పటికీ ఆ స్పీకర్ యొక్క ఉద్దేశం వాడు ఏదో కొంత డబ్బు, కీర్తి సంపాదించాలనా లేక మనుషులను జ్ఞానులుగా చెయ్యాలని వాడి ఉద్దేశమా అని మనం గ్రహించాలి. రాజకీయనాయకులు అందరూ మనకోసం సేవ చేస్తున్నారు అని మనం అనుకొంటాము కాని వాడి ప్లెజర్ కోసం వాడు అందులో ఉన్నాడు. మేము 30 సంవత్సరాల నుండి రాజకీయంలో ఉన్నాము, మాకు ఏమీ అధికారం ఇవ్వకపోతే ఎలాగ అంటారు. అంటే అది ఒక ప్లెజర్. కొంతమంది మతం పిచ్చివాళ్ళు ఉంటారు. శివుడికంటే విష్ణువు గొప్పవాడని, విష్ణువుకంటే శివుడు గొప్పవాడని ఇలా అంటూ ఉంటారు. మీకు జ్ఞానం లేనప్పుడు ఎవరు గొప్పవారు అయితే మీకు ఎందుకు?

వారు ఆలోచించే మాటలకు అసలు అర్థం ఉందా? ఇదా మతం. నాగరికత పెరిగిపోయింది, సైన్స్ పెరిగిపోయింది అని చెపుతున్న ఈ రోజులలో పాలకొల్లు చినగోపురం వీధులలో శివుడు ఊరేగుతూ ఉంటే శివుడిని చూడకూడదు అని ఆ వీధిలో ఉన్నవారు అందరూ టపటపా తలుపులు వేసేసుకొంటారు. వాళ్లంతా విష్ణుభక్తులు అన్నమాట, పొరపాటున శివుడు కళ్లలో పడతాడని తలుపులు మూసేసుకొంటారు. ఇదా మతం. ఇదా జ్ఞానం. శివుడి యొక్క స్వరూపం విష్ణువు, విష్ణువు యొక్క స్వరూపం శివుడు అని శాస్త్రం చెపుతూ ఉంటే ఈ పేచీలు ఏమిటి? అసలు ఇంతమంది దేవుళ్ళు ఉన్నారా? హిందూమతంలో ఇంతమంది దేవుళ్ళు ఎలా వచ్చారు? కొంతమందికి విష్ణువు రూపం అంటే ఇష్టం, కొంతమందికి దేవీ రూపం అంటే ఇష్టం. గణపతి అంటే కొంతమందికి ఇష్టం, కుమారస్వామి అంటే కొంతమందికి ఇష్టం. ఉపాసన కోసం హిందూమతంలో అలా చెప్పారు. పేచీలకోసం కాదు. మీకు ఏ రూపం ఇష్టమైతే ఆ రూపాన్ని ధ్యానం చేసుకోండి. అంతేగాని మీరు ఆరాధిస్తున్న రూపం ఎక్కువ అని, మిగతారూపాలు అన్నీ తక్కువ అని, ఆ రూపాలకు విలువ లేదని మీరు అనుకోవద్దు. మీ ఊరిలో చెఱువు ఉంది, దానికి పది రేవులు ఉన్నాయి. అందులో మీరు ఏ రేవులో నుండి దిగినా చెఱువులోనికి వెళతారు. అదే భగవాన్ చెప్పారు. మీలో సిన్సియారిటీ కనుక ఉంటే మీరు ఏ నామరూపాలను ఆరాధించినప్పటికీ అవి నామరూపంలేని స్థితికి అంటే ఆత్మ దగ్గరకు మిమ్మల్ని తీసుకొనిపోతాయి అని చెప్పారు.

ఆత్మ యొక్క సౌందర్యం మీకు తెలిస్తే ఇంక ప్రకృతి సౌందర్యం వైపుకు కళ్ళు తిప్పి చూడాలనిపించదు. చైతన్యం ముందు జడం ఎంతండీ? మీకు ఆత్మసుఖం కనుక మీకు తెలిస్తే అందులో నుండి మీ మనస్సు అసలు బయటకు రానే రాదు. అయితే ఆత్మసుఖాన్ని మీరు సంపాదించుకోవాలని అనుకొంటున్నారు కాని అది మీలోనే ఉందని, సాక్షాత్తూ ప్రకాశిస్తోందని, మీకోసం ఎదురు చూస్తోందని మీకు తెలియటం లేదు. మీలో ఉన్న ఆత్మ మీకోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తోంది. ఈ జీవుడు ఎప్పుడు వస్తాడు, నాలో ఎప్పుడు కలుస్తాడు అని ఎదురు చూస్తోంది. మనకు నిజమైన చుట్టం భగవంతుడే, ఆయనే మనకు నిజమైన స్నేహితుడు, భగవంతుడే మనకు నిజమైనగురువు. మీకు భగవంతుడి మీద ప్రీతి కలుగకపోతే, భగవంతుడి మీద ప్రేమ కలుగకపోతే, ఆయన చెప్పిన మాటలయందు విశ్వాసం కుదరకపోతే అది భగవంతుడిలో ఉన్న దోషం కాదు, దానికి మన హృదయంలో ఉన్న పాపం కారణం. మీకు భగవంతుడి మీద విశ్వాసం కలుగకపోతే నాకు భగవంతుడి పట్ల ఎందుకు విశ్వాసం కలగటంలేదు అని మీరు ఎవరిని అడగనక్కరలేదు. మీలో ఎవరికైనా

భగవంతుడి మీద విశ్వాసం కలుగకపోతే దానికి మీలోపల ఉన్న పాపం కారణం అనుకోండి. మనిషికి వాడి హృదయంలో పాపం ఉన్నంతకాలం భగవంతుడి మీద విశ్వాసం కలుగదు, భగవంతుడు చెప్పిన మాటలు నమ్మడు. భగవద్గీత భగవంతుడి ముఖంలో నుండి వచ్చింది. అది వేదంతో సమానమే. భగవద్గీత చదవటం వేరు, నమ్మటం వేరు. భగవంతుడు చెప్పిన మాటలను ఎంతమంది నమ్ముతున్నారు? భగవద్గీతలో కొన్ని విషయాలు ఆయన గురించి ఆయనే చెప్పేసుకొన్నాడు. ఆయన గురించి ఆయన చెప్పకోకపోతే మనకు తెలియదని, సిగ్గు విడిచిపెట్టేసి ఆయన గురించి ఆయనే చెప్పకొన్నాడు. ఏవండీ భగవంతుడు ఆయన గురించి ఆయన చెప్పకోవటం ఏమిటి అని మీలో ఎవరైనా అడగవచ్చు. మరి ఆయన గురించి ఆయన చెప్పకోడు అనుకోండి ఇంక ఆయన గురించి మనలో ఎవరు చెప్పగలరు? ఆయన గురించి చెప్పగల సమర్థత ఈ లోకంలో ఎవరికి ఉంది? ఆయన గురించి చెప్పగల సమర్థత అసలు ఇంకొకరికి ఉంటే కదా!

ఆత్మవిద్యను మన బుర్రకు పట్టించటంకోసం, మనలో ఉన్న ప్రాపంచిక జ్వరాన్ని తగ్గించి మనలను ఆత్మతత్వం దగ్గరకు తీసుకొనిపోవటం కోసం ఎన్నో రకాలుగా, ఎన్నో కోణాల నుంచి గీతలో పరమాత్మ చెప్పాడు. ఆత్మవస్తువు దగ్గరకు మనలను తీసుకొనిపోవటం కోసం ఆయన ఒకోచోట ఎంతో మృదువుగా చెప్పాడు, ఒకోచోట ఎంతో కఠినంగా చెప్పాడు. ఇన్ని కోణాల నుండి ఎందుకు అంటే మన బుర్రకు పట్టించటంకోసం ఇన్ని రకాలుగా చెపుతున్నాడు. ఆయన మీద మనకు గౌరవం కలగటంకోసం ఆయనకు ఎంత ఔన్నత్యం ఉందో, ఆయన ఎంత గొప్పవాడో ఆయనే మనకు చెప్పకొంటున్నాడు. ఆయన మీద మనకు గౌరవం లేకపోతే ఆయన చెప్పిన మాటలు మనం వినం కదా అందుచేత ఆయనమీద మనకు గౌరవం కలిగేటట్లు ఆయనే చేసుకొంటున్నాడు. ప్రేమలేనిహృదయాలకు, దయలేని హృదయాలకు, సంస్కారంలేని హృదయాలకు ఈశ్వర స్వరూపం తెలియబడదు. గాడ్ ఈజ్ లవ్, గాడ్ ఈజ్ ట్రూత్, గాడ్ ఈజ్ కంపేషన్. ఒక వస్తువు కొనుక్కోవాలంటే మీ దగ్గర డబ్బు ఉండాలి, మీరు బజారుకు వెళ్ళి ఆ వస్తువును కొనుక్కోవాలి. భగవంతుడిని తెలుసుకోవటానికి మీకు అంత బాధ కూడా లేదు. మీకు ప్రత్యక్షంగా మీ హృదయంలోనే ప్రకాశిస్తున్నాడు. మీరు చేసిన కృషి వూరికే పోదు. ఇప్పడు మీరు కొంత సాధన చేస్తే రాబోయే జన్మలలో సంస్కారవంతులైన కుటుంబాలలో, మీ సాధనకు సహకరించే కుటుంబాలలో మీకు దేహం యిచ్చి మీచేత మరింతగా సాధన చేయిస్తానని భగవంతుడు హామీ ఇస్తున్నాడు. భగవంతుడు అబద్ధం చెప్పడు. ఈ అవకాశాన్ని మీరు ఉపయోగించు

కోండి. మీరు చేసిన మంచికాని, మీరు చేసిన యోగంకాని, మీరు చేసిన కృషికాని వృథా పోదు. మీరు ఎంత శ్రవణం చేస్తే అంత, ఎంత ఆచరిస్తే అంత, ఎంత తెలుసుకొంటే అంత మీకు కలిసివస్తుంది. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోండి.

భగవంతుడు లేని కాలం లేదు. భగవంతుడు ఎప్పుడూ ఉన్నాడు. కాలువలో నీళ్ళు చూడండి, అలా ప్రవహిస్తూనే ఉంటాయి. నిన్నటి నీళ్ళు ఈరోజు లేవు, ఇవాళ నీరు రేపు ఉండదు కానీ కాలువ మటుకు అలా ప్రవహిస్తూనే ఉంటుంది. సమాజంలో మంచి, చెడు అలా ప్రవహిస్తూనే ఉంటాయి. కాలం అలా ప్రవహిస్తూనే ఉంటుంది. కాలాన్ని కూడా మన మనస్సే కల్పించింది. కాలాన్ని జయించినవాడు, కామాన్ని జయించినవాడే జ్ఞాని కాగలడు. భగవంతుడిని ప్రేమించండి, ఆయనకోసం జీవించండి. మనం ఆత్మను తెలుసుకోలేకపోయిన భగవంతుడిని తెలుసుకోలేకపోయినా కనీసం తెలుసుకొనే ప్రయత్నంలో మరణించండి. ఆ ప్రయత్నంలో మరణించిన వాడికి ఉన్నతమైన జన్మ, ఉదాత్తమైన శరీరం ప్రసాదిస్తానని ఈశ్వరుడు వాగ్దానం చేస్తున్నాడు. ఎవడైతే ఈశ్వరుడికోసం తన జీవితాన్ని తాను పోగొట్టుకొంటాడో వాడికి స్వర్గరాజ్యం లభిస్తుంది. మీ మనస్సు నిర్మలమయితే ఈ భూమిమీద ఉన్న అందాలన్నీ కనిపిస్తాయి. మీకు శాంతి లేకపోతే మీతోటి వారికి శాంతి ఎలా ప్రసాదించగలరు. కనీసం మన బట్టలకు ఇచ్చే విలువ, మన శారీరక ఆరోగ్యానికి ఇచ్చే ప్రాముఖ్యత, మనం తినే అన్నానికి ఇచ్చే ప్రాముఖ్యత కూడా మనం ఆత్మను తెలుసుకోవటానికి ఇవ్వటం లేదు. ఇది దురదృష్టం. శరీరం కోసం ఎన్ని విటమిన్లు ఉన్న ఆహారం తీసుకొన్నప్పటికీ, శరీరానికి రోగాలు రాకుండా దానిని ఎంత జాగ్రత్తగా చూసుకొన్నప్పటికీ ఏదో రోజు శరీరం పడిపోవటం ఖాయం. నెహ్రూగారు, బిర్లాగారు చనిపోయారు అంటే వైద్యం చేయించుకోవటానికి డబ్బు లేక చనిపోలేదు. మీకు ఎప్పుడైనా జ్వరం వస్తే, రొంపపడితే ఆరోగ్యం చెడిపోయిందని కంగారు పడిపోతారు. మీకు అనారోగ్యం వచ్చిందని ఆరోగ్యం కోసం ఆందోళన పడుతున్నారే, మరి ఆత్మను తెలుసుకోలేకపోతున్నాము అని ఆత్మ కోసం ఆందోళన పడే జీవుడు ఎవడైనా ఉన్నాడా? ఇవాళ ఉండి, రేపు పోయే శరీరం కోసం మీరు ఇంత కంగారు పడుతున్నారే, మరి శాశ్వతమైన ఆత్మకోసం మనం చేసే కృషి ఏమిటి? మనం ఏమి ప్రయత్నం చేస్తున్నాము? ఎప్పుడైనా బట్ట చిరిగిపోతే మనకు బాధ కలుగుతుంది. మరి ఆత్మను తెలుసుకోవటానికి ఆ మాత్రం కూడా బాధపడడం లేదే? ఆత్మను తెలుసుకోలేకపోతున్నాము అని కనీసం ఎప్పుడైనా సహజంగా మీకు బాధ కలిగిందా?

మీరాభాయికి తొమ్మిదవ సంవత్సరంలో పెళ్ళిచేసి అత్తవారింటికి పంపటానికి సవారీలో

కూర్చోబెడుతున్నారు. ఆవిడతో పాటు బట్టలు, నగలు, ఎన్నో వస్తువులు పెడుతున్నారు. అప్పుడు మీరాభాయి ఏమందంటే ఇన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నేను రోజూ పూజ చేసుకొనే కృష్ణుడి విగ్రహాన్ని నాకు ఇవ్వండి. ఐవాంట్ మై లార్డ్ కృష్ణ అని చెప్పింది. ఈ మాటలు ఎక్కడ నుండి వచ్చాయి. తన జన్మాంతర సంస్కారంలోనుండి, పూర్వజన్మ పుణ్యంలో నుండి విరుచుకొని ఆవిడ హృదయంలోనుండి పెల్లుబిక వచ్చిన మాటలు. అమ్మా నేను అడిగింది వస్తువులు కాదు, బట్టలు కాదు, నా కృష్ణుడి విగ్రహాన్ని నాకు ఇవ్వండి అని మీరాభాయి అడిగింది. ఆమె కృష్ణుడి కోసం తన గౌరవాన్ని పోగొట్టుకొంది, తన ఆరోగ్యాన్ని పోగొట్టుకొంది, తన వంశాన్ని వదులుకొంది, సమాజాన్ని వదులుకొంది, కృష్ణుడికోసం తన బంధువులకు దూరమయ్యింది. అందుచేతనే ఆవిడ గాంధీగారికి కూడా ఆరాధ్యదైవం అయ్యింది. మీరాభాయికి ఉన్నంత గౌరవం మీకు లేకపోయినా, మీకు ఉన్న కొద్దిపాటి గౌరవాన్ని మీరు భగవంతుడికోసం సాక్రిఫైస్ చెయ్యగలరా? మన ఇంట్లో ఉన్న మనుషులు మనతో మాట్లాడకపోతే మనకు భయం వేస్తుంది, అటువంటి పిరికిపందలం. ఇంక మనం ఏమి త్యాగాలు చేయగలము. మీరాభాయి వలన కుటుంబగౌరవం పోతోంది అని ఆమె బంధువులు మీరాభాయికి విషం పెడితే అది కూడా కృష్ణుడి ప్రసాదం అని తాగింది. ఆమె విషం తాగుతూ ఉంటే ఆమె కంఠం నలుపెక్కలేదు, ఏ కృష్ణుడి విగ్రహాన్ని మీరాభాయి పూజిస్తోందో ఆ కృష్ణుడి యొక్క కంఠం నలుపెక్కిపోయింది. అంటే మీరాభాయి కోసం భగవంతుడే విషం తాగాడు. అది మీరాభాయి డివోషన్. కృష్ణుడితో మీరాభాయి వ్యాపారం చెయ్యలేదు. ఆమె కృష్ణుడి కోసం జన్మించింది, కృష్ణుడికోసం జీవించింది, కృష్ణుడిని ప్రేమించింది, కృష్ణుడికోసం మరణించటానికి విషం తాగింది, అదీ మీరాభాయి. ఇట్ ఈజ్ నాట్ ఎ ట్రేడ్, ఇట్ ఈజ్ లవ్, ఇట్ ఈజ్ బ్యూటిఫుల్ లవ్, ఇట్ ఈజ్ వండర్‌ఫుల్ లవ్. జ్ఞానం తోటి సమానమైన వస్తువు ఈ లోకంలో ఏదీ లేదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. పోనీ పరలోకంలో ఉందా అంటే జ్ఞానంతో సమానమైన వస్తువు ఈ లోకంలోనే కాదు, పరలోకంలో కూడా లేదు. అది జ్ఞానం యొక్క వైభవం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-01-2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నువ్వు ట్రూత్‌ను రియలైజ్ చేసావు అనుకో నీకు కొన్నివేల సంవత్సరాలు ఒకరోజు కింద వెళ్ళిపోతాయి. అలా ఎలా వెళతాయి అని నీవు అనుకోవచ్చు. ట్రూత్‌ను కనుక రియలైజ్ చేస్తే అక్కడ నీకు టైము లేదు. గాఢనిద్రలో కూడా చూడండి మనం ఏడు గంటలు, ఎనిమిది

గంటలు నిద్రపోతే అప్పడే ఇంతటైము అయిపోయిందా అనిపిస్తుంది. పగలు అలా వెళ్ళదుగదా! టైము కూడా ఒక తలంపే. గాఢనిద్రను జ్ఞాపకం పెట్టుకోమంటున్నారు ఆచార్యులవారు. నిద్రలో గొప్పతనం ఏమిటి అంటే నువ్వు ఏదైతే కాదో వాటిలో నుండి అక్కడ విడిపోతున్నావు. మీకు వందకోట్లు డబ్బు ఉన్నా మాకు డబ్బు ఉందని మీరు నిద్రలో అనుకోరు కదా! నిద్రలో మీరు మీ దేహంతోటి, పేరుతోటి, మీ ధనంతోటి, చదువుతోటి ఇలా మీరు ఏదైతే కాదో వాటి అన్నింటిలో నుండి విడిపోతున్నారు. ఎందుచేతనంటే అక్కడ నేను అనే తలంపు లేదు. ఈ సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు మొత్తం క్రియేషన్ అంతా కూడా నేను అనే తలంపు మీద ఆధారపడి ఉంది. దానిని షేక్ చేస్తే ఏమీ లేదు. ఇప్పడు మనం నేను, నేను అంటున్నాము. ఆ నేను అనే తలంపు నిజం అనుకొంటున్నాము కదా! కనీసం దానిని డౌట్ చేయటం లేదు. డౌట్ చేస్తే షేక్ చేస్తారు. నేను అనే తలంపు నిజం అనేది మనకు బలపడిపోయింది. అందుకే ఈ సాధనలు అవి వచ్చాయి. గాఢనిద్రలో నువ్వు కాని దానిలో నుండి విడిపోతున్నావు. అక్కడ నువ్వు ఉన్నావా లేదా అంటే నువ్వు ఉన్నావు. నువ్వు ఏదైతే కాదోదానిలో నుండి నువ్వు విడిపోవచ్చు కాని నువ్వు ఏదైతే అవునో అందులో నుండి ఎలా విడిపోతావు. నిద్రలో నుండి లేవగానే నువ్వు నిద్రాస్థితిని ధ్యానం చెయ్యి అని ఆచార్యులవారు చెప్పారు. మనలో ఉన్న మూడు అవస్థలకు ఆధారంగా ఒక సద్వస్తువు ఉంది. ఆ సద్వస్తువు లోనే నీ మనస్సును ఎప్పడూ అక్కడే ఉంచాలి అంటే నేను అనే తలంపును అక్కడే ఉంచాలి. గాఢనిద్రలో నువ్వు ఏ స్థితిలో ఉన్నావో, జాగ్రదవస్థలోనికి వచ్చిన తరువాత మనస్సుతో దానిని ధ్యానం చేస్తే అప్పడు ఆ నిద్రాస్థితి నీకు జాగ్రదవస్థలో వచ్చేస్తుంది. నీకు నిద్రలో బంధం ఉందా అంటే లేదు. జాగ్రదవస్థలో కూడా నువ్వు బంధరహితుడవు అయిపోతావు.

నీకు ఫ్రీడమ్ కావాలి అంటే ట్రూత్‌ను రీలైజ్ చేయవలసిందే. అంతకంటే ఇంకో అవకాశం లేదు. నీ హృదయంలో ఉన్న సత్యంలోనే ఫ్రీడమ్ ఉంది, బయట ఎక్కడా లేదు. సత్యజ్ఞానం ఉన్నవాడు మాత్రమే దుఃఖాన్ని అతిక్రమించగలడు అంటే దుఃఖసముద్రాన్ని దాటి బయటకు వెళ్ళగలడు. సత్యానుభవం పొందే వరకు నిన్ను ప్రతీ జన్మలోను ఏదో రకమైన దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. కుటుంబంలో ఒకరినొకరు ప్రేమించుకొంటారు కదా! మీ చర్మం ఎంత పలచగా ఉంటుందో మీ ఇంట్లో ఉన్న ప్రేమలు, ఆప్యాయతలు అటువంటివే. సంసారంలో మీకు వచ్చే లాభాలు అన్నీ కూడా వ్యవహారికమే. ఉన్నది ఒక్కటే లాభం, అది అంతర్యామికి సంబంధించిన జ్ఞానం. దానిని పొందటంకంటే నీకు లాభం అంటూ ఏమీలేదు. ఒకవేళ అంతకంటే లాభాలు ఏమైనా ఉన్నాయి అని నీకు అనిపించినా అవి అన్నీ కూడా

స్వప్నసమానము. ట్రూత్ అనేది మూడు అవస్థలకు ఆధారంగా ఉంది కాని వీటితో దానికి సంబంధం లేదు. సినిమా తెరమీద నిప్పు కనిపిస్తుంది, నీళ్ళు కూడా ప్రవహిస్తూ ఉంటాయి. సినిమా తెరమీద కనిపించే నిప్పు ఆ తెరను కాల్చదు, నీళ్ళు తెరని ఏమీ తడపవు. అవి బొమ్మలు, షాడోస్. సత్యానుభవం పొందినవాడికి ప్రాపంచిక విషయాలు కూడా అటువంటివే. చావులు పుట్టుకలు కూడా అటువంటివే. కోరిక వేరు, ప్రేమ వేరు. కోరికకు ట్రేడ్ ఉంటుంది, ప్రేమకు ట్రేడ్ ఉండదు. సెల్ఫిష్‌లవ్ మీకు రీలైజేషన్‌కు ఉపయోగపడదు. నేను అనే తలంపును ఓవర్‌కమ్ చేసినప్పుడు ఇంక నీకు ఇతరులు లేరు. ఇతరులు లేనప్పుడు ఇంక సెల్ఫిష్‌లవ్ ఏమిటి? సత్యజ్ఞానం మీరు పొందినప్పుడు ఎవరూ మమ్మల్ని చూడటంలేదు, ఎవరూ మాతో మాట్లాడటంలేదు ఇటువంటి మాటలు ఇంక ఉండవు. ఆత్మజ్ఞానం ఒక్కటే సత్యజ్ఞానం. నీ చదువు, నీ వృత్తి మిగతావన్నీ కూడా డెస్టినీని బట్టి వస్తాయి. సత్యజ్ఞానం తప్పించి అసత్యజ్ఞానం గురించి నువ్వు ఏది మాట్లాడినా బంధానికి గురి అవుతావు. ప్రకృతి మాటలు ఏది మాట్లాడినా వాటి వలన నీ మనస్సు మైలపడుతుంది, నీ మనస్సు పొల్యూట్ అవుతుంది, నీ మనస్సు మసి బారుతుంది. నీ మనస్సును మసిచేసే మాటలు ఇంకవద్దు. జ్ఞానసముపార్జనకు ఉపయోగపడని మాటలు ఏమీ మాట్లాడవద్దు. మాటల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండండి. నువ్వు ఇలా చేసావు ఏమిటి? ఇలా చెయ్యకూడదు. అలా చెయ్యాలి అని ఏదైనా అవసరం అయినప్పుడు ఇతరులకు మనం చెప్పవచ్చును. అలాగ సహృదయంతో కనుక నువ్వు విమర్శ చేస్తే మంచిదే. అంతేగాని లోపల విరోధం పెట్టుకొని కేవలం విమర్శ చేయటం కోసం విమర్శిస్తే అది మంచిది కాదు. విరోధం పెట్టుకొని చేసే విమర్శ సరిగా ఉండదు. మనం మంచి పని చేసినా కొంతమంది ఏదో తిడుతూ ఉంటారు, దానికి విరోధం కారణం.

సదాచారం అంటే ఏమిటి అని ఒక భక్తుడు ఆచార్యులవారిని అడుగుతున్నాడు. దైవాన్ని, చైతన్యాన్ని నిరంతరం చింతించటం, నిరంతరం ధ్యానించటం కంటే సదాచారం ఏముంది? డెస్టినీ ఏదో దెబ్బలు కొడుతూ ఉంటుంది. మీకు అదృష్టం తీసుకొని రావచ్చు, దురదృష్టం తీసుకొని రావచ్చు. రెండూ కూడా స్వప్నమే. ఇంట్లో వాళ్ళు మనలను బాగా చూడాలని లేకపోతే బాగా చూడకూడదని అలా ఏమీ అనుకోవద్దు. ఇంట్లో వాళ్ళు మనలను బాగా చూస్తే సంతోషపడతాము, వాళ్ళు బాగా చూడకపోయినా కూడా సంతోషించాలి. ఎందుచేతనంటే వాళ్ళు మనలను బాగా చూడకపోవటం వలన మనకు వైరాగ్యం వస్తుంది, అది మంచిదే. వాళ్ళు మనలను బాగా చూస్తే మనకు బంధం వస్తుంది, అది ప్రమాదం.

నీలో ఉన్న నేను నువ్వు కాదు, నాలో ఉన్న నేను నేను కాదు. ఈ చూడటాలు, చూడకపోవటాలు ఇవన్నీ కూడా ఈ నేను అనే తలంపు మీదే ఆధారపడి ఉన్నాయి. చూస్తే బాగా చూస్తున్నారు అనుకోవటం, చూడకపోతే బాగా చూడటంలేదు అనుకోవటం, ఇదంతా ఐ తాట్టే. మనిషిలో మంచీ, చెడూ రెండూ ఉండవచ్చు. మీరు మనిషిని చూసేటప్పుడు వాడిలో ఉన్న మంచినే చూడండి, చెడువైపు చూడవద్దు. మీరు మనుషులను చూసేటప్పుడు డార్క్‌సైడ్ చూడటం మానేయండి అంటున్నారు ఆచార్యులవారు. ఆ రెండింటికి ఆధారంగా ఉన్నది చైతన్యమే. అక్కడ ద్వంద్వాలు లేవు. మంచి అని, చెడు అని అక్కడ లేదు. ఈ ద్వంద్వాలను అతిక్రమించాలి అంటున్నారు ఆచార్యులవారు. హ్యూమన్ మైండ్‌లో ఉన్న డార్క్‌సైడ్ చూడవద్దు. నువ్వు మంచినే చూడు. డార్క్‌సైడ్ చూడటం వలన నువ్వు ఎమోషన్లకు గురి అవుతావు. దాని వలన నీకు మరల దుఃఖం వచ్చేస్తుంది. నీ సాధనకోసం లౌకికులతో స్నేహాలు తగ్గించుకో. లౌకికులతో స్నేహాల వలన ఎమోషన్స్ పెరగవచ్చు. బదరీ, పూరీ, శృంగేరీ, కాశీ, రామేశ్వరం, హరిద్వార్ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్ళి సాధన చేసుకోవచ్చు. ఆ ప్రదేశాలలో మనస్సు కొంత నిర్మలమవుతుంది. కొన్ని ప్రదేశాలకు వెళితే మనం ఏకాంతంగా ఉండవచ్చు అని కొంతమంది ఆచార్యులవారితో అంటున్నారు. దానిని ఆచార్యులవారు ఏమీ విమర్శించటంలేదు. అసలు ఏకాంతవాసం ఎక్కడ ఉంది అంటున్నారు ఆచార్యులవారు. స్వార్థం, అహంభావన ఇవి మొలకెత్తేటప్పటికే మీకు ఏకాంత వాసం పోతుంది, అది వృక్షం అవ్వనక్కరలేదు. మీరు ఎక్కడ ఉన్నా అవి మొలకెత్తేటప్పటికే మీకు ఏకాంతవాసం పోతుంది, మీరు బదరీలో ఉన్నా పోతుంది, కాశీలో ఉన్నా పోతుంది. ఏకాంతం అనేది ఒకచోటే ఉంది. ఎక్కడైతే దేహగతమైన నేను తలెత్తదో అక్కడే ఏకాంతవాసం ఉంది. కాశీ వెళితే, రామేశ్వరం వెళితే ఏకాంతవాసం వస్తుందని భక్తులు ఏదో చెపుతూ ఉంటే ఇవన్నీ ఆచార్యులవారు ఒప్పకోవటం లేదు, అంటే అక్కడకు వెళ్ళకూడదు అని కాదు. అహంవృత్తి ఎక్కడైతే మొలకెత్తటం లేదో అక్కడే ఏకాంతం ఉంది. అక్కడ ఏకత్వం ఉంది కాని అనేకత్వం లేదు. అక్కడ నువ్వు ఏది చూసినా నీకు భిన్నంగా ఏమీ కనబడదు. నేను అనే తలంపులోనే బంధం అంతా ఉంది. లోపల ఉన్న అంతర్యామికి ఎక్కడా ఎటాచ్‌మెంట్స్ ఏమీ లేవు. ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ ఫియర్, ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ డెత్. కొంతమంది వాళ్ళకు ఇష్టమైన వాళ్ళు చనిపోతే వీళ్ళూ చనిపోతారు, దానికి కారణం ఎటాచ్‌మెంట్. మీలో ఎవరికైనా సఫరింగ్ ఉంది అనుకోండి దానికి బయట కారణాలు నిజం కాదు. ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ సఫరింగ్. ఎక్కడ సఫరింగ్ ఉందో

అక్కడ ఎటాచ్‌మెంట్ ఉన్నట్లు గుర్తు. లోపల ఉన్న అంతర్యామి స్థాయికి నువ్వు రావాలి అంటే నీకు జ్ఞానమే మార్గం. మీరు ఉదయాన్నే నీళ్ళతో ముఖాలు కడుక్కొంటున్నారు కదా అలాగే జ్ఞానంతో మైండ్ యొక్క ముఖాన్ని కడగండి. అలా కడిగారు అనుకోండి, మీ మనస్సు పవిత్రం అవుతుంది, అప్పుడు ఇంక అదర్‌నెస్ ఉండదు. చేపలు ఎలాగైతే నీటిలో ఈదుతాయో అలాగ ప్యూరిఫైడ్ మైండ్స్ ఆనందంలో ఈదుతూ ఉంటాయి. ఎండ్‌లెస్ బ్లిస్. ముగింపు లేని శాంతి, ముగింపు లేని ఆనందంలో మనస్సు ఈదుతూ ఉంటుంది. అప్పుడు ఇంక దానికి ఎటాచ్‌మెంట్స్‌తోటి పనిలేదు. మనకు నేను అనే తలంపు ఉంది కదా! అది చైతన్య సాగరంలో నుండి వచ్చింది. దానిని చైతన్యం లోనికి ఉపసంహరించాలి. నేను అనే తలంపును ఉపసంహరించి నీ హృదయసాగరంలో లయం చేస్తే అప్పుడు బ్లిస్ అనే ఓషన్ నిన్ను వరిస్తుంది. అక్కడ ఆనందం తప్పించి ఇంక ఏమీ లేదు.

ఇప్పుడు నీకు శరీరంతో తాదాత్మ్యం ఉంది, మనస్సుతో తాదాత్మ్యం ఉంది అలాగే లోపల ఉన్న సత్యవస్తువుతో నీకు తాదాత్మ్యం రావాలి. కోట్లు డబ్బు ఉన్న వారందరు మేము ధనవంతులం అనుకొంటారు కదా! నాకు ఏదీ లేకపోయినా అంతకంటే ధనవంతుడిగా ఉన్నాను అంటే ఇందులో రహస్యం ఏమిటి అంటే హృదయసంపద. నిజమైన సంపద అంతా హృదయంలోనే ఉంది. ఈజ్ ద డెత్ ఆఫ్ దిస్ బాడీ యామ్ ఐ డెడ్. ఇదే కీలకం. ఈ శరీరం చనిపోయింది, నేను కూడా చనిపోవాలి కదా! మరి చనిపోకుండా ఉన్నాను ఏమిటి? ఆ ఉండటం అనేది మీరు శరీరం ఉండగా ఎరుకలోనికి తెచ్చుకోవాలి. అప్పుడు మీకు ఎటుచూసినా ఆనందమే. ఆ ఉండటం అనే దానితో మీకు ఎప్పుడైతే తాదాత్మ్యం వచ్చిందో, ఎప్పుడైతే దానిని అనుభవంలోనికి తెచ్చుకొన్నారో అప్పుడు మీరు ఆనంద తీర్థంలో, శాంతి తీర్థంలో, బ్రహ్మ తీర్థంలో స్నానమాడతారు. మీరు పెద్ద పెద్ద స్నేహాలు చేయలేకపోయినా లౌకికులతో స్నేహాలు తగ్గించుకోండి. ఎందుచేతనంటే వారు మీ మనస్సును పొల్యూట్ చేస్తారు. చిన్న చిన్న మొక్కలుగా ఉన్నప్పుడు రక్షణకోసం చుట్టూ కంచెవేస్తాము, చెట్లు పెద్దవి అయ్యాక కంచె అక్కరలేదు. అలాగే ఇప్పుడు మనం సాధనలో ఎర్లీ స్టేజ్‌లో ఉన్నాము కాబట్టి చుట్టూ కంచె వేసుకోండి. మొక్కలను దూడలు తినకుండా కంచె వేస్తారు కదా అలాగే లౌకికుల బాధ లేకుండా కంచె వేసుకోండి. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వచ్చాక అంటే రామకృష్ణుడు, భగవాన్ అంతటి స్టేజికి వచ్చాక ఇంక కంచె ఎందుకు? భగవాన్ స్థితికి చేరుకొన్నాక లౌకికులు, అలౌకికులు అనేది ఏమీ లేదు. అక్కడ అదర్‌నెస్ లేదు కదా!



# శ్రీ రామకృష్ణ సేవా సమితి

**రిజిష్టర్ నెం. 81/2009, ది॥ 25-07-2009**

శ్రీ స్వామి వివేకానంద స్ఫూర్తితో 2009 నవంబరులో హైదరాబాదు మల్కాజిగిరిలో అనాథ పేద విద్యార్థుల ఉచిత వసతి గృహము ప్రారంభించబడినది. అనాథ లేక బీద బాలురకు 10వ తరగతి నుండి ఉచితముగా వసతి, భోజనము, పుస్తకాలు పరీక్ష ఫీజు, బస్సు పాసు సౌకర్యము కల్పించబడును. వారు జీవితములో స్థిరపడువరకు ఈ సౌకర్యము కల్పించబడును. 7 సం॥ల నుండి అద్దె భవనములో నిర్వహించబడుచున్నది. ఏప్రియల్ 2015లో బాలాజీ నగర్‌లో 266 చ॥గ॥ కొని డిసెంబరులో సొంత బిల్డింగ్ ప్రారంభించబడినది. ఒక లక్ష విరాళము ఇచ్చిన వారి పేరు మీద రూము కట్టించబడును. 50 వేలు విరాళము ఇచ్చినవారి (ఇద్దరు దాతలు) పేర్లు రూముకి ఇరు వైపులా లిఖించబడును. 10వేలు పైబడి ఇచ్చిన వారిపేర్లు కూడా వ్రాయబడును.


- ☞ మాకు 80జి ఇన్‌కమ్‌టాక్స్ సౌకర్యము కలదు.
- ☞ మా బ్యాంకు సిండికేటు బ్యాంకు.
- ☞ ఎస్‌బి అకౌంటు నెం. 30632010017320
- ☞ IFSC కోడ్ SYNB0003063.

**డా॥ కె.వి.ఎస్.ఆర్. శర్మ, ప్రెసిడెంట్**

**సెల్ : 9848742324**

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**



**సద్గురు శ్రీ నాన్నగారితో**

**హర్షవర్ధన్** (జాయింట్ కమీషనర్) **దంపతులు**

# "మాయ" అంటే నిరంతరం మారే స్వభావం కలది దానికి ఉనికి లేదు

మార్పుకు మాయలకు అలవాటు పడ్డ మనం వాటిని సత్యమని నిత్యమని భ్రాంతిలో పడి మాయను మాయగా గుర్తించలేకపోతున్నాము. ఆత్మలేకపోతే మనస్సుకు ఉనికిలేదు. మనిషి నువ్వు వేరు, నేను వేరు అనుకొన్నప్పడే రెండుగా విభజించబడతాము. మీరా అంది నువ్వు అన్నా ఉండాలి, నేనైనా ఉండాలి. 'నేను' ఉంటే (జీవుడు) నీవు (ఆత్మ) ఉండదు. నీవు ఉంటే నేను ఉండను. అంటే ఒక వరలో రెండు కత్తులు ఉండవని అర్థం. పసిపాపకు తల్లి 'అమ్మా' అని మాట నేర్పుతుంది. అంటే నువ్వు వేరు నేను వేరు అని అది నేర్పబడింది. అది వ్యవహారపు సౌకర్యం. అది సత్యమైపోయింది. వ్యక్తిత్వానికి కేంద్రమైపోయింది. అప్పటినుంచి చైతన్యం అంతా ఈ నేనుకు చుట్టుకొని అల్లుకుపోయింది. భ్రమగా తయారైనది. దానితో జీవితం అంతా తప్పగా మారింది. సాక్షిగా మారాలి అంటే 'నేను'ను విడిచి, నమ్రతతో గర్వం లేకుండా ఉండాలి. 'నేను' అనేది ఒక సంజ్ఞగానే వాడాలి. వ్యవహారపు జగత్తులో మనం ఈ 'నేను'ను ఉపయోగించక తప్పదు. మాయ నిజమనుకొంటే నరకం తప్పదు. ఏది సత్యమో దాన్ని గురించే సాధకుడు విచారణ చెయ్యాలి. శ్రీ నాన్నగారు "వస్తువు అందుబాటులో లేనప్పడు అందరూ పెద్దమనుషులే వస్తువు అందుబాటులో ఉన్నా ఎవరి మనస్సు వికారం చెందదో వారే ఉత్తములు" అన్నారు. ఈ మాయనే ప్రపంచంలో అన్నిమతాలు మారుడు అని పాపమని, తిరస్కారమని అంటాయి. ఈ ప్రపంచమంతా అహంకారమనే నీడలో నిర్మించబడింది. దాన్ని మనం పూర్తిగా విశ్వసిస్తున్నాము. అసలు అనుమానమే కలగటం లేదు. కాబట్టి అది వాస్తవం సంతరించుకొన్నది. మన చూపు వెనుక మన కర్మల వెనుక ప్రకాశింపచేస్తున్న ఆ పరమ శక్తిని కనుగొనాలి. ఆ శక్తే మనమని తెలుసుకోవాలి. బాహ్యరూపనామాలను ఎంత శ్రద్ధతో చూస్తున్నామో అదే శ్రద్ధతో ఆ పరమశక్తిని గ్రహిస్తే రూపసంకటాలు రూపుమారి పోతాయి అని నిరంతరం విశ్వసించాలి. ఈ జాగరూకతే సాధన. ఈ మాయ జీవితం వదులుకుంటే సత్య జీవనంలో గురు అనుగ్రహంలో పడవచ్చును. మనం అనాత్మ దేహాలకోసం వ్యసనపడితే స్వార్థం, దుఃఖం ఆవేశాలకు గురి అవుతాము. జన్మ మరణ చక్రంలో తిరుగుతూ దుఃఖాలయాల చుట్టూ తిరుగుతూ ఉండవలసిందే. ఈ రహస్యం గురుముఖతా విన్నదాన్ని మననం చేసుకొంటూ ఎరుకతో జీవించటమే మన ధర్మం. అప్పడే మనం 'మాయ'ను మాయం చెయ్యగలం. దీనికి కాల పరిపక్వం కావాలి. గురుకటాక్షం కోసం నిరీక్షించాలి, ఓర్పుతో సాక్షి జీవితం గడపాలి. ఈ మన ప్రయత్నంలో, నిజాయితీ ఉంటే అది నిజమైతే పవిత్రులమైతే గురువు పరవశించి మన అహంకారాన్ని పూర్తిగా తుడిచేసి మన స్వరూపాన్ని మనకు ఎరుకపరుస్తారు. ఇది సత్యసమ్మతమైన పంథా. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**